అభిమానాలు

[కథానిక]

★

శ్రీ వజ్ఝల రామనరసింహం

శర్మ ఆఫీసునుంచి రాగానే, అతనికి కనిపించిన దేమంటే – టేబిలుమీద కాఫీ ఫ్లాస్కు, పక్కనే ఒక గాజుగ్లాసు. వాకిట్లోని మెట్లమీద కూచుని, సాయంత్రపు చల్లగాలిని అనుభవిస్తూ, రాధ పుస్తకం చదువుకొంటూవున్నది. రోజూవలె ఆమె వచ్చి, గ్లాసులో కాఫీ పోసి, శర్మ కీయలేదు; యీ మధ్యని శర్మకు తెలుసుకూడా.

శర్మ బట్టలు మార్చుకొని, టేబిలువద్దకి వచ్చి, గ్లాసును చేత్తో తీసి, ఏదో రెండు నిమిషా లాలోచించి, మళ్ళీ ఆ గ్లాసును యథాస్థానంలో వుంచేశాడు. ఆతర్వాత, పైమీద కండువా వేసుకొని, వీధిలోకి నడుస్తూ, "వీధితలుపులు తీసివున్నయ్" అని కేక వేశాడు. ఏ గోడకో చెప్తున్నట్లుగా! అతను వెళ్ళిన రెండు నిముషాలకు తలుపులు వేసిన చప్పుడు వినపడ్డది.

శర్మ హోటలులో కాఫీ తాగి, తిన్నగా పార్కుకి వెళ్ళి, అక్కడ ఒక బెంచీమీద కూలబడి దీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయాడు.

తనకి పెళ్ళి అయి రెండేళ్లు గడిచింది. పెళ్లి నాటినుంచి కొద్దిరోజులక్రితంవరకు గృహంలో వున్న వాతావరణానికి, ప్రస్తుతపు పరిస్థితికి చాలా భేదం వున్నది. సంసారంగురించి, దాంపత్యజీవనంగురించి తను చాలా పుస్తకాల్లో చదివేడు. విన్నాడు – కాని, మాటపట్టింపుచేత పరిస్థితులు ఎంతవరకైనా వెళ్లుతాయనే విషయాన్ని ఇప్పుడే గ్రహించాడు... రాధను తను ఎంతో ప్రేమించాడు; ఇంకా ప్రేమిస్తున్నాడు; ఆమెను తను స్వయంగా పెళ్లిచేసుకొన్నాడు. ఆమెయందు తన కున్న ప్రేమ నిష్కల్మషమైనది. ఇంత ప్రేమకి బదులుగా తను కోరిం దేమంటే, ఆమె తన అభిప్రాయాలతో ఏకీభవించాలనే. అయితే – రాధకి కూడా తనయం దేమీ తక్కువ ప్రేమ లేదు. ఆమెకి వున్న కోరికకూడా స్వల్పమైనదే – తన భావాలతో తన భర్త ఏకీభవించాలని! తన మాటకి యింట్లో విలువ వుండాలని ఆమెనమ్మకం, తన మాటకికూడా విలువ వుండాలని శర్మ విశ్వాసం... కొద్దిరోజులకిందట తనకీ రాధకీ వాదన వచ్చింది. ఇంతా చేస్తే, అసలువిషయం ఏమీ లేదు. ఇంటిఖర్చువిషయంలో. తను ఒక అభిప్రాయం, రాధ ఒక అభిప్రాయం పెట్టుకొని కూచున్నారు. రాధ తన అభిప్రాయాల్ని, భావాలను త్యాగం చేసి, భర్తతో ఏకీభవించడానికి ఒప్పలేదు; అట్లాగే శర్మ కూడా తన అభిప్రాయాల్ని మార్చుకొనడానికి అతని వ్యక్తిత్వం, పౌరుషం అడ్డువస్తున్నవి! "నామీద మీకు ప్రేమలేదు. నా మాటని ఎప్పుడూ త్రోసిపుచ్చుతారు" అంది రాధ. "నామీద మాత్రం నీకేమైనా అభిమానం కాని, నామాటయందు గౌరవంకాని వున్నాయా? నిజం చెప్పు!" అన్నాడు శర్మ. అంతే! ఆవిషయం నేటికీ తేలలేదు!

మరోమారు, ఏదో సినిమాగురించి ప్రస్తావన వచ్చింది. శర్మ సినీమా బాగులేదన్నాడు. రాధ "నాకు నచ్చింది" అని అమాయకంగా అన్నది. "ఔను! నాకు బాగులేదు కాబట్టి

నీవు తప్పక నచ్చుతుంది అనే అనుకొన్నాను" అన్నాడు శర్మ!

"నా అభిప్రాయం చెప్పుకోవడంకూడా నేరమేనా?" అంది రాధ.

"అది అభిప్రాయం కాదు. నా మాటని కాదనడం!"

"అంటే, నామాటల్లో మీకు ఏమీ విశ్వాసం లేదన్నమాట!"

నిజంగా, రాధమాటల్లో తనకి విశ్వాసం గౌరవం లేవా? అనుకొన్నాడు శర్మ. వున్నదనే తను అనుకొంటున్నాడు; కాని, లేదంటుంది రాధ. ఏది నిజం? ఈ పరస్పరఅనుమానాలకి, అపనమ్మకాలకి మూలకారణం ఏమిటి?... ఇదంతా అయోమయంగా వున్నది. ఈ ఆలోచనలకి అంతు లేదు... రెండుఅరచేతుల్లోను బుర్ర పెట్టుకుని, శర్మ యింకా ఆలోచిస్తూనే వున్నాడు...రాత్రి అయిపోయింది. పార్కులో ఎవరూ లేరు.. శర్మ దిగ్గున లేచి, రిస్టువాచీవైపు ఓమారు చూసుకొని, తొందరగా, ఇంటివేపు నడిచాడు.

ఇంటితలుపులు తీసేవున్నవి. టేబిలుమీద దీపం వెలుగుతూవున్నది. అంతవరకూ నేలమీద పడుకొని చదువుకొంటూ వున్న రాధ, శర్మ వచ్చేసరికి లేచి కూచుంది. శర్మ బట్టలు మార్చి, పడకకుర్చీలో కూచున్నాడు. "చాలా ఆలస్యమైంది. ఇంక భోజనానికి లేవండి" అని రాధ అంటుందని శర్మ నిరీక్షిస్తున్నాడు. కాని, ఆమె ఏమీ అనలేదు — నిజానికి, రాధకి చాలా ఆకలిగా వుంది. భర్త రాకపోవడంమూలాన తను యింతవరకూ భోజనం చేయలేదు.

"రాధా! నేను రావడం చాలా ఆలస్యమైంది. నువ్వు వేగిరం భోజనం చేసేవలసింది" అని శర్మ తనని లాలిస్తాడని రాధ ఆశించింది — కాని, అతడు మౌనంగా కూచున్నాడు.

పావుగంట గడిచింది. ఎవరు మాటలాడలేదు. రాధకు లోనుంచి దుఃఖం వుబికివస్తున్నది. తనకి భర్తవల్ల తీరని అన్యాయం జరుగుతున్నట్లుగా వుంది. ఇంతసేపయి తనతో ఒక్క మాటయినా అనడానికి అతనికి కష్టంగా వుంది. తనకి ఎంత ఆకలిగా వుందో — అంతకంటె, ఎంత దుఃఖంగా వుందో, అతనికేమీ అవసరం లేకపోయింది. తనమీద అతనికి ఏమాత్రమూ జాలి లేదు; ప్రేమ లేదు. తనను యిన్నాళ్లూ ప్రేమిస్తూ వున్నాడనుకొన్న భర్త యింత కఠినుడని తను అనుకోలేదు. ఇంటికి వచ్చినప్పటినుంచి యింతసేపయినా తనతో ఒక్కమాటయినా ఆడలేదు. ఒక్కమారు తనను పలకరిస్తే తను ఎంతగా సంతోషించేది!

శర్మ ఆలోచనలు కూడా యిదేవిధంగా వున్నవని వేరే చెప్పనక్కరలేదు! రాధనుంచి మొదటి మాట వస్తుందని అతను ఆశిస్తున్నాడు. కాని ఆమె పెంకెగా వూరుకొన్నది. తనే మొదట మాట్లాడాలని శాస్త్రం ఏమిటి? అదీ కాక, మొదట మాట్లాడినవారు "ఓటమి"ని ఒప్పుకొన్నట్లు అని అతని వుద్దేశం!...శర్మకు విసుగు జనించింది. దిగ్గున లేచి, మర్సు వేసుకుంటున్నాడు. రాధ పరిస్థితిని గమనించింది.

"మళ్ళీ ఎక్కడకు వెళ్లిపోతున్నారు?"

".. ......ఏం?........"

"భోజనం చెయ్యకుండా వెళ్లిపోతారా?"

"భోజనానికి లెమ్మని నువ్వు చెప్పేవా?"

"మీరు అడుగుతే నేను భోజనం పెట్టనూ?"

"అంటే, నువ్వు యివాళనుండి నన్ను భోజనానికి లెమ్మనమని పిలవ్వు అని అర్థమా?"

"నేను ఆవిధంగా అన్నానా?"

"అయితే మరి ఎందుకు పిలవలేదు?"

"భోజనానికి రావద్దని నేను అన్నానా?"

"రమ్మనమని పిలవలేదు కదా!"

"మీరు వస్తారని చెప్పేరా మరి?"

"రానని చెప్పేనా?"

"నేను వద్దు అనలేదు కూడా...పోనీ, యిప్పుడైనా రండి"

శర్మ భోజనం వేగిరం ముగించి, వెంటనే డాబామీదకు పోయి పడుకున్నాడు. అయిదునిముషాలతర్వాత రాధకూడా వచ్చి, అతని పక్కనే చాపవేసికొని పడుకొంది.

గంట గడిచింది. పోలీసుటాణాలో కొట్టిన గంటలు 11 వినిపించినవి. ఇంతసేపూ ఇద్దరూ మౌనంగానే వున్నారు. శర్మ పక్కకు తిరిగి, రాధతో అన్నాడు.

"రాధా! నువ్వు భోజనం ఎప్పుడు చేస్తావు?" తను భోజనం చేయకుండా పడుకున్నదన్న సంగతి భర్తకి ఏట్లా తెలిసిందా అని ఆశ్చర్యపోతూ, రాధ అంది:

"నాకు ఆకలిగా లేదు యివాళ"

"రాధా! నువ్వు నిజం చెప్తున్నావా?"

"...నా ఆకలి చచ్చిపోయింది"

"అందుకు నేనే కారణ మంటావు?"

"నేను అల్లాగేమీ అనలేదు"

"కాని, నీ వుద్దేశం అదే! నీ తప్పుకీ, నా తప్పుకీ కూడా శిక్ష అనుభవించేది నేనే"

"మీరు తప్పుచేశారని నేను అనలేదు. నేను చేసిన తప్పులు ఏమిటో దేముడికే తెలియాలి"

నీకేదో దురన్యాయం జరుగుతున్నదనుకొని, అలిగి తిండి తినడం మానేస్తావు. నేను కూడా ఆవిధంగా చెయ్యలేకనా? కాని అది వృత్తి తెలివితక్కువపని — అయితే, నీ తెలివితక్కువకికూడా నేనే బాధపడాల్సివస్తూంది."

"ఎంతలేసి కఠినమైన మాట లంటూవున్నారో మీకు తెలుసునా? పోనీండి, యింకా ఏడిపించండి. అసలే అన్నం తినలేదు. ఆకలిమీద వున్నదాన్ని ఏడిపించండి"

"ఆకలి చచ్చిపోయిందన్నావుగా, ఒక నిముషం కిందటే? ఇంతలోనే ఆకలి పుట్టుకొచ్చిందా?"

ఈ ఆక్షేపణకి రాధ నిలవలేకపోయింది. ఒక్కమారుగా దుఃఖం వచ్చి, వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. రాధను చూసి, శర్మకి నిజంగా జాలికలిగింది. ఆమెను తన దగ్గరగా తీసుకుని వూరడిద్దామన్న కోరిక కూడా కలిగింది. అతను లేచి, రాధవేపు తిరిగాడు. కాని, మళ్లీ వెంటనే పడుకున్నాడు.

మర్నాడు సాయంత్రం, శర్మ ఆఫీసునుంచి వచ్చేటప్పుడు, ఒక మంచిసిల్కు జాకెట్టు కొనితెచ్చాడు. రాధకు దానినిస్తూ "రాధా! నీకు మంచి సిల్కు జాకెట్టు తెచ్చాను. చూడు!" అని ఆమెవైపు చూసి, చిరునవ్వు నవ్వేడు. రాధ నవ్వలేదు. జాకట్టు తీసికొని, యింటోకి వెళ్లిపోయింది.

ఆనాడు రాత్రి ఆమె ఆజాకెటును వేసుకోలేదు. కొత్తబట్టలతో ఆమెను చూసి ఆనందించడం శర్మకి అలవాటు అని ఆమెకు తెలుసు. రాధ కొత్తచీర కట్టినప్పుడు "రాధా! ఈ చీరతో నువ్వు ఎంత చక్కగా వున్నావు?" అని శర్మ మునుపు అంటూ వుండేవాడు......

రాత్రి పడుకునేముందర శర్మ రాధతో అన్నాడు:—

"రాధా! జాకెట్టు వేసుకోలేదేమీ?"

"ఏమీ లేదు.. ..."

"వేసుకోడం యిష్టం లేదా?"

"ఎందుకు లేదండీ"

"రాధా! నిజం చెప్తున్నాను! నీమీద అభిమానంకొద్దీ ఆజాకెట్టు యివాళ కొన్నాను.

నువ్వు వేసుకుంటే చూసి సంతోషిద్దామనే తెచ్చాను - ఇది నీకు తెలుసునుకూడా..."

రాధ మాట్లాడలేదు. మౌనంగా ఆకాశం వైపు చూస్తూ పడుకున్నది.

అయిదురోజులు గడిచాయి. ఆనాడు సాయంత్రం శర్మ ఆఫీసునుంచి వచ్చాడు; రాధ చక్కగా ముస్తాబై, చిరునవ్వుతో, అతనికెదురుగా వచ్చింది. ఆనాడు ఆమె కొత్తసిల్కుజాకెట్టు వేసుకొంది.

రాధ కాఫీ యిస్తూ, శర్మకి దగ్గరగా వచ్చి నుంచున్నది. శర్మ ఆమెజాకెట్టువైపు చూడలేదు. శర్మకి జాకెట్టు కనిపించేలా జాకెట్టు చేతులను సర్దుకుంటూ, రాధ అంది

"అట్లా వున్నారేం? తలనొప్పిగా వుందా?"

"వూఁ కొంచం నొప్పిగానే వుంది" అన్నాడు శర్మ పక్కకి చూస్తూ.

"కొంచం తలరాయనా? నొప్పి తగ్గుతుందేమో" అని రాధ శర్మకి దగ్గరగా వచ్చింది. నిజానికి శర్మదృష్టిలో తను వేసుకున్న జాకట్టు పడాలనీ, అతడు తనను మెచ్చుకోవాలనీ. రాధ అట్లా చేసింది. కాని, శర్మ మరింతపక్కకి దృష్టి మరల్చుకుంటున్నాడు.

"వద్దు! తల రాయక్కర్లేదు"

"ఏమీ?"

"కొంచం ఆఫీసుకాగితాలు రాసుకోవలసిన పని వుంది"

రాధ ఓ నిముషం ఆలోచించి అన్నది:

"కొత్త జాకట్టు వేసుకున్నాను చూడండి."

"జాకట్టు మంచి [illegible]వుంది. నీ వంటిరంగుకి ఇది ఎంతో చక్కగా వుంది" అని శర్మ అంటాడని రాధ అనుకుంది; కాని, అతడు ఆమెవేపేనా చూడకుండా, "[illegible]" అన్నాడు.

రాధకి చాలా ఆశాభంగమైంది:

'బావుందా?' అంది మెల్లగా.

"బావుందో లేదో నీకు తెలియాలి కాని నాకెట్లా తెలుస్తుంది? నేను వేసుకోలేదు కదా!"

"వేసుకున్నారని అన్నానా? ఇంతకు మునుపు ఎప్పుడూ మీరు కొత్తబట్టల బాగోగులగురించి చెప్పేవారు కనక వే అడిగేను - లేకపోతే అడిగకేపోదును"

"ఇంతకు మునుపు బుద్ధిగడ్డితిని అనేవాడిని - ఇకనుంచీ మరి అన్నానంటే"

'ఈపాటిదానికి అంతకోపం ఎందుకూ? ఇష్టం లేకపోతే అవిధంగా చెప్పేయండి"

"ఎవరికి యిష్టం లేదు? ముచ్చటపడి ఆ వేళ జాకెట్ వేసుకోమంటే వేసుకున్నావా? లేదే! ఇప్పుడు చెప్పు ఎవరికి యిష్టం లేదో"

"ఆవేళ వేసుకోలేదన్నంత మాత్రాన నాకిష్టం లేదనిన్నీ నింద వేశారన్నమాట. అంతే కాదా?"

"నువ్వు కూడా, అంత చిన్నకారణం చేతనే నా కిష్టంలేదని నిర్ణయించివేశావు కదా?"

రాధకి ఏమి మాట్లాడాలో మరి తెలియలేగు, అయిదునిముషాలు మౌనంగా వుండి కొని, తనలో తను అనుకుంటున్నట్లుగా, గద్గదస్వరంతో అన్నది:

"ఇవాళ వుదయంనుంచీ అనుకుంటూనే వున్నాను, ఏదో వాదన యిట్లా వస్తుందనే"

"అంతదూరదృష్టి వున్నదానవు నా దగ్గరకు పని కట్టుకుని వచ్చి జాకెట్టు బాగోగుల గురించి ఎందుకు వేధించుకుతిన్నావూ?"

రాధ త్రుళ్లిపడినట్లయింది:

"మిమ్మల్ని వేధించుకుతిన్నానా? పరే లెండి. ఇకముందు ఎప్పుడూ అలాంటినేరం చేయను లెండి" అని, రాధ గిరుక్కున తిరిగి ఇంట్లోకి పోయింది.

ఆనాడు రాత్రి శర్మ భోజనం చేస్తూవుండగా, రాధ అన్నది:

"మావూరికి టిక్కట్టు ఎంతవుతుంది?" శర్మ ఇంకా అట్లా తలవంచుకునే భోజనం చేస్తూ మెల్లిగా అన్నాడు:-

"మీవూరు ఈపక్క స్టేషనే కదూ. మహా అయితే, రైలుమీద పావలా అవుతుంది; బస్సుమీద అరణాలు! అంతకంటే ఎచ్చవదు"

రాధ ఏదో ఆలోచించసాగింది. శర్మ యింకా, అట్లాగే తలవంచుకుని, భోంచేస్తున్నాడు. ఒకరివైపు ఒకరు చూస్తున్నట్టుగా లేదు.. ...రాధకి ఏదో టక్కున జ్ఞాపకం వచ్చినట్లుగా, అడిగింది:

'మీదగ్గిర ఒక రూపాయి వుంటే యివ్వగలరా? బస్సుకి అరుఅణాలు పోను, మిగతాది ఏదేనా దోవఖర్చుకి వుంటుంది"

"నా షర్టుజేబులో రెండురూపాయల నోటు వుంది; తీసుకో" అన్నాడు శర్మ, యింకా తలవంచుకునే. రాధ మాట్లాడలేదు. ఆమె పెద్దకళ్లలో ఏదో ఆశ్చర్యం, బాధ, విచారం —అన్నీ విచిత్రమైనట్లు కన్పిస్తున్నది. తను భర్తతో ఏమి మాట్లాడిందో తనకే తెలియనట్లుంది. ఆ మాట్లాడినంతసేపూ తను ఏదో మనాతంలో, మత్తులో మాట్లాడినట్లుగా, ఇంకా తనను ఆమత్తు వదలనట్లుగా కనిపిస్తున్నది...

శర్మ పళ్లెంలో చేయి కడుక్కొని, లేచి వెళ్లిపోతూవుండగా, రాధ "ఏమండీ" అని పిలిచింది. శర్మ ఆగి, వెనుతిరిగి, "ఏమిటి" అన్నాడు.

రాధ తలవంచుకొని, నేలమీద కాలిబొటనవ్రేలు రాస్తూ, మెల్లిగా అంది:-

"అయితే...అంతే నన్నమాట?..."

"ఏమిటి 'అంతేనన్నమాట' ? నాకు ఏమీ బోధపడలేదు" అన్నాడు శర్మ.

"నేను మావూరు వెళ్లిపోవడం.. అంటే ...వెళ్లిపోతే...కాదు. కాదు - నేను వెళ్లిపోవడమే మీకోరిక అన్నమాట?"

"ఇదుగో, రాధా! వెళ్లి మరోకనిందను నామీద వేస్తున్నావు. నిన్ను వెళ్లిపొమ్మని నేనింతవరకూ అన్నానా? నిజం చెప్పు! నీ అంతట నీవే, మీ వూరికి టిక్కట్టెంతని అడిగావు; చెప్పేను. డబ్బు అడిగావు - తీసుకోమన్నాను. ఇందులో నా తప్పేమైనా వుందా?"

రాధ తలఎత్తి, శర్మముఖంలోకి తీక్షణంగా చూసింది. అతనికి ఏమి జవాబివ్వాలో

(36-వ పేజీ చూడుడు)

ఉబ్బసం శాశ్వతంగా తిరోముఖం పట్టుతుంది

పురోహిత్ శ్వాసహారి, ఉబ్బసమును వెంటనే శమన పరిచి ఏవరూ దానిని కుదుర్చును. ఇది యొక్కటే వాగా వాడిచూడబడిన శాస్త్రీయమగు (డాక్టర్ల) ఔషధము వరుసగా గత యిరవై మొనిమిదేండ్ల నుండి పేరుగాంచినది

పురోహిత్ శ్వాసహారి రు. 3-8/- లేక రు. 6-/ లేక రు. 10/- లకు. 3 జా. 6 జా. 12 జా. సీసాలలో మంచి కెమిస్టులవద్ద గాని దిగువతెలిపిన మాన్యుఫాక్చరర్లవద్ద గాని దొరకును [illegible] పురోహిత్ ఫార్మసి, కొల్హాపూర్ (ఎం. ఎస్. ఎం.)

పురోహిత శ్వాసహారి

అభిమానాలు

(11-వ పేజీ తరువాయి)

రాధకు తెలియలేదు...ఆమె శరీరమంతా దుఃఖంతో దహించుకుపోతున్నది. తను వెళ్లిపోతానన్నా కూడా, తన భర్తకి ఏమీ ఆటంకం లేకపోయింది. కనీసం, ఎందుకు వెళుతున్నావని అయినా అడగలేదు. తను యింట్లో లేకపోయినా, అతనికి కష్టం లేదన్నమాట! అతనికి తనమీద ఏమాత్రమూ జాలి, అభిమానము, లేదని ఇప్పుడు మరొకమారు రుజువైంది. ప్రేమలేని తనబతుకు వ్యర్థం - తన జీవితమంతా నిస్సారమని ఇప్పుడు తేలిపోయింది... తనవంట్లోని శక్తులు అన్నీ వీగిపోతున్నట్లుగా వున్నది...రాధ వెర్రిగా చెబ్తూ అంది:

"కాని...కాని నేను వెళ్లిపోతానంటే మీరు వుండమనలేదు కదా?"

"నీఅంతట నీవే వెళ్లిపోతానంటే నే నేం చేసేది? వుండమనకపోడం మాత్రం నాతప్పా?"

"నేను వెళ్లిపోవడమే మీకు కావలసినది ...నేను లేకపోతేనే మీకు సుఖంగా వుంటుందని యివాళ తెలిసింది. నామీద మీకు ఏమీ ప్రేమ లేదు. ప్రేమే వుంటే, నేను వెళ్లిపోవడం మీరు సహించగలరా? లేదు...లేదు... మీకు ఏమీ అభిమానం లేదు......"

రాధకి గొప్పఆవేశం వచ్చినట్లయింది. ఆమె యీ మాటలనిస్సి, నేలమీద కూలబడిపోయింది. శర్మ గదిలోకి వెళ్లిపోబోతూ వుండగా, రాధ మళ్లీ అంది:

"పోనీండి - మీసుఖమే నేను కోరేది. రేపుమధ్యాహ్నం బస్సులో నేను మావాళ్ల యింటికి వెళ్లి ఓ 2 నెలలపాటు వుండి వస్తాను. ఆరెండునెల్లయినా మీరు సుఖంగా వుండవచ్చు"

శర్మ మాట్లాడలేదు. రాధవైపు అట్లానే చూస్తూ, నించున్నాడు. ఆమె మళ్లీ అంది:-

"రేపుమధ్యాహ్నం మీరు ఆఫీసునుంచి వెంటనే రాగలరా?"

"కష్టం రావడానికి వీలుపడదు"

"అయితే, ఇంటితాళాలు పొరుగింట్లో యిచ్చేస్తాను తీసుకోండి"

ఈమాటలు అంటూవుండగా, రాధగొంతుక గద్గదికమైపోయింది. ఆరాత్రి యిద్దరూ మరేమీ మాట్లాడుకోలేదు......

మర్నాడు వుదయం శర్మ ఆఫీసుకి వెళ్లే ముందర భోంచేస్తూవుండగా కూడా, ఎవరూ అట్టే మాట్లాడలేదు. శర్మ భోజనంముగించి లేచాక, రాధ అట్లానే వంటింట్లో కూచుండిపోయి, గంటవరకూ ఏదో ఆలోచిస్తూన్నది. ఆతర్వాత గబుక్కున లేచి, వీధితలుపులు వేసికొని, గదిలో నేలమీద పడుకొంది.

పడుకున్నవెంటనే రాధకి ఆపుకోబడని దుఃఖం వచ్చింది. ఇన్నాళ్లయీ ఆమెలో గడ్డకట్టుకొనిపోయివున్న దుఃఖమంతా, ఈనాడు కరిగి- కన్నీటిధారల రూపంలో బయటికి వస్తున్నది. ఆమె ఎంతసేపు ఏడిచిందో ఆమెకు తెలియదు. కాని, ఈ ఒక్క సమయంలోనే, ఈ నిముషంలోనే, తన జీవితమంతా తన కళ్లయెదుట గోచరిస్తున్నది. ఎట్లా గోచరిస్తున్నదీ అంటే - అది కేవలం దుఃఖమయమనీ, కన్నీటిమయమైనదీ అనీ !

గోడగడియారం 2 గంటలు కొట్టింది. రాధ త్రుళ్లిపడిలేచింది. బస్సుకి వేళఅయినట్లుంది. తన పెట్టె సర్దుకోడానికి పక్కసామానుకొట్లోకి గబగబా వెళ్లింది. ఆమెకళ్లు ఎర్రబడి, యింకా నీళ్లతో నిండేవున్నవి.

రాధ సామానుకొట్లో ప్రవేశించినవెంటనే, అక్కడ ఆమెకు కనిపించిన దృశ్యానికి ఆమెఒడలు ఝల్లుమంది. అప్రయత్నంగా ఆమె ఒకకేక వేసి, అక్కడే నించుండిపోయింది - ఈ సందర్భంలో, ఈ సామాను కొట్టుగురించి కొంత చెప్పడం అవసరం... ఈ కొట్టు చాలా చిన్నది. సామానంతా యిందులోనే వుండడంవల్ల, కిటికీతలుపులు, వీధివేపుద్వారం, అన్నీ ఎల్లప్పుడూ మూసే వుంటవి. అంచాత కొట్లో సాధారణంగా చీకటిగానే వుంటుంది.

ఆచీకట్లో, ఒమూలని వున్న పాతపడకకుర్చీలో, ఓవ్యక్తి - శర్మ - పడుకుని వున్నాడు...రాధ కేకవేసినవెంటనే, శర్మ లేచి, ద్వారంవరకూ వచ్చాడు. అతనిముఖం కారుమేఘాలు కమ్ముకొనివున్న ఆకాశంవలె వున్నది. కళ్లలో నీటిబింగువులు నిలిచి వున్నయ్.

రాధ ఈదృశ్యానికి తట్టుకోలేకపోయింది. శర్మ ఈరూపంలో, యీస్థితిలో, విషాదమూర్తివలె యిక్కడ వున్నాడేం? అతని ముఖంలోని విషాదరేఖలను చూసినవెంటనే, రాధకి భళ్లున దుఃఖం వచ్చింది. ఆమె వెక్కివెక్కి ఏడుస్తున్నది. శర్మ ఆమెవేపు చూసి, "రాధా! ఎందుకు ఏడుస్తావ్?" అన్నాడు. ఈ బొంగురుపోయిన కంఠస్వరం శర్మది కాదు.

రాధ చప్పున అతని రెండుపాదాలమీద చేతులు వేసి "నన్ను క్షమించండి...నన్ను క్షమించండి...అభాగ్యురాలిని... నేనెక్క-



భారతప్రభుత్వ ఆహారశాఖామంత్రి కె. ఎం. మున్షీ గారు క్రిందటివారం మీనంబాకం విమానాశ్రయంలో దిగినపుడు నగరప్రముఖులు మంత్రులు వారికి స్వాగతం చెప్పారు.

డికీ వెళ్లను...వెళ్ల లేను...మిమ్మల్ని ఈ స్థితిలో ఒదిలి నే నెక్కడికీ వెళ్ల లేను! నే నేం చేసినా, అంతా మీ ప్రేమకోసమే చేశాను. మీ అభిమానంకోసమే చేశాను. నేను మాపూరు వెళతాననడం, మీ ప్రేమని పరీక్షించడానికే అన్నాను. నాకు మీ ప్రేమ కావాలి. మీ అభిమానంఅది లేనిదే నేను బ్రతకలేను. ఈ జీవితమంతా మీ ప్రేమమీదే ఆధారపడి వుంది. మీ ప్రేమకోసం ఏమి చేయమన్నా చేస్తాను. నా మీద మీకు ప్రేమలేదని యిన్నాళ్లు కృశించిపోతున్నాను. మీ ప్రేమ ఎప్పుడైనా నాకు లభించదా అనే వెర్రిఆశ మీదే యింకా నేను జీవించివున్నాను. నా జన్మ, జీవితం, సంసారం, సుఖం, అన్నీ మీ ప్రేమకోసమే, మీ ప్రేమఅంతా నాకు కావాలి. నేను మిమ్మల్ని మనసారా ఆరాధిస్తున్నాను – నేను నిజం చెప్తున్నాను. నన్ను నమ్మండి. నన్ను నమ్మండి. ఇంక నాకు కావలసినది మీ హృదయపూర్వకమైన ప్రేమమాత్రమే. ఆ ప్రేమకోసమే నేను జీవించివున్నాను. ఆ ప్రేమలేదని తెలిసినవాడే చనిపోతాను"

రాధకు గొప్ప ఆవేశం కల్గినట్లు అయింది. ఈమాటలను ఆమె అని, అయిదునిముషాలు ఆగి, మళ్లీ అంది:

"ఈస్థితిలో మిమ్మల్ని చూడలేను. చెప్పండి, మీ రెందుకో దుఃఖిస్తున్నారు. మీరు ఆఫీసుకి వెళిపోయారనుకున్నాను. కాని. వుదయంనుండి ఈ చీకట్లో పడుకొని దుఃఖిస్తున్నారు. ఎందుకో నాకు చెప్పండి"

రాధను శర్మ మెల్లిగా లేవనెత్తి, 'రాధా' అని మాత్రం అని, ఏదో చెప్పబోయి, బొటబొట కన్నీరు కార్చ నారంభించాడు. అయిదునిముషాలతర్వాత, కన్నీరు తుడుచుకుంటూ, "రాధా! అసలు యీ కల్లోలమంతా ఎందుకు వచ్చింది?" అని శర్మ అడిగి, కొంచంసేపు ఏదో ఆలోచించి, మళ్లీ అన్నాడు:

"రాధా! నువ్వు వెళ్లిపోతానంటే నేను నిజంగా సహించలేకపోయాను. నీమీద నాకు ఎంతో ప్రేమ వుంది. కాని అది పైకి కన్పరచలేకపోయాను......"

అయిదునిముషాలవరకు యిద్దరూ నిశ్శబ్దంగా వూరుకొన్నారు. ఆతర్వాత, శర్మ



ఆమె లేతచేతులను తన. చేతుల్లోకి తీసుకొని, ఆప్యాయంగా నిమురుతూ అన్నాడు:

"రాధా! నిజం చెప్తున్నాను. నువ్వు నా ప్రాణానివి. నిన్నెంతో అధికంగా ప్రేమిస్తున్నాను......"

ఈ మాటలను అంటూ, శర్మ రాధకళ్లలోకి చూశాడు. ఆ నిర్మలమైన చూపులోనే రాధకు కావలసినదంతా వున్నది.